శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## గురుతెలియని వాహనం ఢీకొని ఒరిస్సా వాసి మృతి

**నెల్లూరు క్రైమ్, జనవరి 17, ప్రభాతవార్త** గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒరిస్సా వాసి మృతి చెందిన సంఘటన నగర సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దినేష్‌నాయక్(40) తిరుపతి జిల్లా బూదనంటోల్ ప్లాజా సమీపంలో ఓ దాబాలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. నెల్లూరులోని తన స్నేహితులను కలవడానికి వచ్చి గొలగమూడి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న దక్షిణ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

## గడపగడపకు గుర్తించిన పనులను వెంటనే పూర్తి చేయాలి



**కావలి, జనవరి 17 ప్రభాతవార్త** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను వెంటనే పూర్తి చేయాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కావలి మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం సాయంత్రం మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేయడం జరిగిందన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 28 సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 12 కోట్ల రూపాయల నిధుల్ని మంజూరు చేసిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టాల్సిన రోడ్లు, మురికి కాలువల నిర్మాణాల పనులు గుర్తించామన్నారు. వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు కూడా విడుదల చేయాలని ఆదేశించారు.

**అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలి...** ఈ నెల 19వ తేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాకరంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విగ్రహావిష్కరణకు తరలివెళ్లేందుకు కావలి నుంచి ఆరు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ,ఎస్టీ, బిసిలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బిసి లంటే తనకెంతో అభిమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## క్రికెట్‌పోటీల్లో ఆలి-11టీమ్ విజయం



**వింజమూరు ,జనవరి17,ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని గంగమిట్ట సమీపంలోని క్రీడా మైదానంలో ఈనెల 14నుండి ప్రారంభమైన ఎంఎంసిఎల్ క్రికెట్ లీగ్ పోటీల్లో ఆలీ-11టీమ్ విజేతగా , రన్న ర్ టీమ్‌గా హోంటీమ్ నిలిచింది. మొదటి బహుమతి 24,786రూపాయలను మాజీ ఎంపిటిసి సభ్యులు తాటిచెట్ల కాలేషా , ద్వితీయ బహుమతి15,786రూపాయలను ఎంపిటిసి సభ్యులు పల్లాల కొండారెడ్డి అందజేశారు. బుధవారం క్రీడామైదానంలో హోరాహోరీగా క్రికెట్ టీమ్‌లు తలపడ్డాయి. జిల్లా స్థాయిలో 16టీమ్‌లు ఈపోటీల్లో పాల్గొన్నారు. చివరిరోజు బుధవారం హోం టీమ్, ఆలీ-11టీమ్‌లమధ్య పోటీ నిలిచింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మాశిలామణి, ఎంపిటిసి సభ్యులు పల్లాల కొండారెడ్డి , మాజీ ఎంపిటిసి సభ్యులు తాటిచెట్ల కాలేషాలు హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ మాశిలామణి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిలను స్వీకరించాలన్నారు. ఎంఎంసిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను 14సంవత్సరాలుగా నిరంతరాయంగా నిర్వహిస్తూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయిలో క్రీడాకారులు తమ సత్తా చాటుకునేందుకు ఎంఎంసిఎల్ నిర్వాహకులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఈక్రీడాకారుల ప్రోత్సాహంతో వచ్చే ఏడాది మొదటి బహుమతి నగదును తాను అందజేస్తానన్నారు. 14సంవత్సరాల నుండి కాలేషా మొదటి బహుమతిని అందించి ముస్లిం సోదరుల్లో ఐక్యతను చాటుతున్నారన్నారు. తాజా,మాజీ ఎంపిటిసి సభ్యులు స్నేహం గుర్తించదగినదన్నారు. నిర్వాహకులు , మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ సలాం తన మిత్ర బృందంతో ఏర్పాట్లను నిర్వహించి క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడం అభినందనీయమన్నారు. అనంతరం గెలుపొందిన వారికి నగదు, ట్రోఫిని అందజేశారు. ఎంఎంసిఎల్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మంజూరు చేయండి



నెల్లూరు జనవరి 17, ప్రభాతవార్త-వైద్యం వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్లు, జిల్లాలోని ఆయా ప్రాంతాల విద్యుత్ గోదాములకు చేరి ఉన్నాయని, వెంటనే వాటిని మంజూరు చేయాలని జిల్లా పర్యవేక్షక ఇంజనీరు వి విజయన్ అధికారులను ఆదేశించాడు. బుధవారం నగరంలోని విద్యుత్‌భవన్‌లో జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించాడు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు గూడూరులోని విద్యుత్‌శాఖ స్టోర్‌లో సిద్ధంగా ఉన్నాయని, ప్రతిఒక్క అధికారి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను డ్రాచేసుకుని, సర్వీసులను మంజూరు చేయాలని, యుద్ధప్రాతిపదికన వాటి పనులను పూర్తిచేయాలని ఆదేశించాడు. జిఐఎస్ సర్వేని వెంటనే పూర్తిచేయాలని, కావలి, కలిగిరి, దగదర్తి, అల్లూరు సెక్షన్‌క్స్ చాలా వెనుకబడి ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. వినియోగదారుడికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నంబరుకి తెలియచేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, అసిస్టెంట్ ఇంజనీర్లు కల్పన, అనిల్, నరసింహారావులు పాల్గొన్నారు.

## కాకుటూరులో అంగరంగవైభవంగా ఎడ్లపందేలు



**వలేటివారిపాలెం జనవరి 17, ప్రభాతవార్త** మండలంలో కాకుటూరు వద్ద సంక్రాంతి సందర్భంగా బండలాగుడు పోటీలను అంగరంగవైభవంగా నిర్వహించారు. కందుకూరు తెదేపా ఇన్‌చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు అధ్యక్షతన గత రెండు రోజులుగా సీనియర్ జూనియర్ విభాగాలలో ఒంగోలు జాతి ఎడ్ల పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ పోటీలను తెదేపా కందుకూరు ఇన్‌చార్జీ నాగేశ్వరరావుతోపాటు మహిళా నేత ఉన్నం నళినీ ప్రారంభించారు.జూనియర్ విభాగంలో 11జతలు, సీనియర్ విభాగంలో 15జతలు పాల్గొన్నాయి. 18క్వింటాల్ బరువుగలిగిన పందెపుబండను 20నిమిషాల్లో ఎక్కువ దూరంలో లాగిన ఎడ్లను విజేతలుగా ప్రకటించే ఏర్పాటు చేశారు.ప్రథమ బహుమతిగా రూ.1.10లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ90వేలు, తృతయ బహుమతికి రూ.70వేలు, 4వ బహుమతికి రూ.60వేలు చొప్పున నిర్ణయించారు.ఇంకా కన్సోలేషన్ బహుమతులు కూడా ఇవ్వదలచారు.ఇందులో బాగంగా బుధవారం జరిగిన ఈకార్యక్రమంలో తెదేపా అతిరదమహీరధులు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నూకసాని బాలాజి, ఉన్నం నళినీదేవి,దివిశివరామ్,ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చీరాల తెదేపా ఇన్‌చార్జీ ఎంఎం కొండయ్య,కనిగిరి మాజీఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి మహేసేన రాజేష్‌మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.కందుకూరు సమీపప్రాంతాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఎడ్లపోటీలను తిలకించారు.

## గంగమ్మ ఆలయంలో " 20గ్రాముల బంగారం, హుండీ నగదు" చోరి

**కొడవలూరు జనవరి 17 ప్రభాతవార్త :** కొడవలూరు మండలంలోని గండవరం గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని కొందరు దుండగలు, అమ్మవారి హుండీను పగలగోట్టి అంచనా 50వేల రూపాయలను మరియు 20గ్రాముల తూకం కలిగి ఉన్న 4 మంగళసూత్రాలను అపహరించుకుని పోయినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శాంతయ్య, పోలీసులకు ఫిర్యాదు చేయగా, కొడవలూరు మండలం ఎస్సై కె. ప్రతాప్ ఆలయాని పరిశీలించి, విచారణ జరిపి, కేసును నమోదు చేసుకొని,దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా అయన విలేకర్లతో మాట్లాడుతూ గుడిలో అమర్చి ఉన్న సిసి కెమరాలను ఆధారాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామన్నారు.

## 10 కోట్లతో నిడిగుంటపాళెంలో అభివృద్ధి పనులు చేశాం



**వెంకటాచలం జనవరి 17 ప్రభాతవార్త** నిడిగుంటపాళెంలో గ్రామంలో 10 కోట్ల 10 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందని,ఎన్నికల సమయంలో శంకుస్థాపన, శిలాపలకాల కాకుండా పనులు పూర్తి ఎన్నికలకు రావడం జరిగిందిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.మండల పరిదిలోని నిడిగుంటపాళెంలో సిమెంట్ రోడ్లు డ్రైన్లు,సచివాలయ భవనం,ఇళ్ల పట్టాలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లబ్దిదారులకు పంపిణి చేశారు.అనంతరం మంత్రి కాకాణి మాట్లడుతూ ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వంలో శంకుస్దాపన,శిలాపలకాలు వేసి ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు.నిరు పేదలకు 5 ఎకరాల భూమిని 1.35 కోట్లతో కోనుగోలు చేసి పంపిణి చేశా మన్నారు.ప్రజల సమస్యలు గుర్తించి అభివృద్ధి చేసినప్పుడే నిజమైన అభివృద్ధని మంత్రి వెల్లడించారు.సర్వేపల్లి నియోజకవర్గంలో ఎక్కడ మట్టి రోడ్డు లేకుండా పూర్తి స్దాయిలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయటడం జరిగిందన్నారు.సుదీర్ఘకాలంగా ఆపరిచితంగా ఉన్న అనేక సమస్యలను గుర్తించి పూర్తి చేశామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి అన్ని వర్గాలు సంక్షేమ పదకాలు లక్ష్యగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని పదకాలు నేరుగా అందుతున్నాయని చెప్పారు.స్వర్గీయ కట్టంరెడ్డి విజయ మోహన్‌రెడ్డి తలపెట్టిన ప్రతి అభివృద్ధి పనులను పూర్తి చేశామని ఈరోజు ప్రారంభంచవ కార్యక్రములో విజయ లేకపోవడం చాలా భాదకరం మంత్రి తెలిపారు. పేదల ఇళ్ల స్దలాలను మంత్రి లబ్దిదారులకు అందజేశారు.కార్యక్రములో ఉప ఎంపిపి కనుపూరు కోదండరామిరెడ్డి,జిల్లా వైసిపి అదికార ప్రతినిది మందల వెంకటశేషయ్య,మండల కన్వీనర్ మోహన్‌నాయడు,కట్టంరెడ్డి శ్రీదర్‌రెడ్డి రోహిత్‌రెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

**చంద్రబాబు అరెస్టు ఖాయం,, మంత్రి కాకాణి**

చంద్రబాబు నాయదు మరోసారి అరెస్టు ఖాయంని చట్ట మందు అందరు సమానమే చట్ట ప్రకారం కేసు నమోదు చేశారని సుప్రికోర్టులో న్యాయమూర్తులు తెలపడంతో మరోసారి చంద్రబాబును అరెస్టు చేయడం ఎలాంటి దోకాలేదని మంత్రి కాకాణి తెలిపారు. సిఐడి అబియోగాలు న్యాయ పరంగా జరిగాయని, గవర్నర్ అనుమతి అవసరమని,మరో న్యాయమూర్తి అనుమతి అవసరం లేదని,ఎక్కడ లోపాలు లేవని సక్రమంగా జరిగాయని సుప్రింకోర్టుచెప్పడంతో చంద్రబాబు అరెస్టుఖాయంని మంత్రి కాకాణి వెల్లడించారు.

## వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుంది- సోమిరెడ్డి




**మనుగోలు, జనవరి 17, ప్రభాతవార్త** వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, ఆగిపోయిన బండేపల్లి, దేగపూడి బ్రాంచ్ కాలువలను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి వర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడి చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివరామకృష్ణతో వెంకటగిరిలో జరిగే తెలుగుదేశం పార్టీ కదిలిరా కార్యక్రమానికి విచ్చేసి బుధవారం ఉదయం మాట్లాడారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ తిరుపతి పార్లమెంటు పరిధిలో రా కదిలిరా తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అదే రోజు సాయంత్రం కడప జిల్లా కమలాపురంలో ఇదే కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నన్ను తిట్టడమే పనిగా.. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఎదురు దాడికి దిగారు. 2015 తుఫాన్‌లో తుఫాన్ నష్టపరిహారం తాను తిన్నట్లు ఆరోపిస్తున్నాడని, ఆ సంవత్సరం పరిహారం చెక్కులు ఇచ్చామని చెప్పారు. నియోజకవర్గంలో మిచౌంగ్ తుఫాన్‌లో గిరిజనులకు మాత్రమే ఈ ప్రభుత్వం అరకొర పరిహారం ఇచ్చిందని విమర్శించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మరోసారి గోవర్ధన్‌రెడ్డి గురించి మాట్లాడుతూ తనకు వెయ్యి కోట్ల రూపాయిలు ఉన్నాయని చెప్పిన మాటను గుర్తు చేస్తూ ఆ డబ్బును నువ్వే తీసుకోవాలని అన్నారు. మొన్న ఎన్నికల్లో గెలిచిన వెంటనే బండేపల్లి బ్రాంచ్ కాలువను పూర్తి చేస్తానని చెప్పి.. ఆరు నెలలు కాలయాపన చేశారని, వచ్చే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గాలి రామకృష్ణారెడ్డి, తిరుపతిపార్లమెంటు కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, వెడిచర్ల రమణారెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రాయిపాటి కిరణ్‌కుమార్, యాళ్ళ యానాది రాయుడు, కే.మధునాయుడు, ప్రసాద్, మస్తాన్, కలిపి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల తుది జాబితా ప్రచురణపై సమీక్ష



**నెల్లూరు అర్బన్,జనవరి17,ప్రభాతవార్త** ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ చేయడానికి అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అన్నారు.బుధవారం స్థానిక కార్పొరేట్లోని శంకరన్ హాల్లో జిల్లాలో తుది జాబితా ప్రచురణకు సంసిద్ధత,జనాభా ఓటర్ల నిష్పత్తి,స్త్రీ,పురుష ఓటర్ల తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ హరి నారాయణన్, జిల్లాలోని ఈఆర్వోలతో సమీక్ష చేశారు. సమావేశంలో అబ్జర్వర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు,చేర్పులు,జాబితా సవరణ అంశాలకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు.వారానికి ఒకసారి రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు.రాజకీయ పక్షాల నుండిగానీ,వ్యక్తుల నుండిగానీ,మీడియాలో గానీ ఫిర్యాదులు వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని పిర్యాదు దారులకు సమాచారం ఇవ్వాలన్నారు.తుది ఓటర్ల జాబితా ప్రచురితం అయిన తర్వాత రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా ఇవ్వాలన్నారు.అనంతరం కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రా లుగా వినియోగించుకున్న పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాల్లో మౌళిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు,విద్యుత్,ఫ్యాన్లు,లైట్లు తదితర సౌకర్యాలు ఈ నెల 25లోగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్,డిఆర్వో లవన్న,ఈఆర్వోలు విద్యాధరి,మల్లోల,శీనా నాయక్, మధులత,బాపురెడ్డి,ఓబులేసు,ప్రేమ్‌కుమార్,కలెక్టరేట్ ఎలక్షన్ తాహశీల్దార్లు,డిటీలు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యలు అనే ఆరోపణలు దారుణం



**నెల్లూరు అర్బన్,జనవరి17,ప్రభాతవార్త** ప్రభుత్వ ఏజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి నెల్లూర్లో డిఆర్ ఉత్తమ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు.చంద్రబాబు అరెస్టు విషయంలో ప్రభుత్వంపై టిడిపి చేస్తున్న కక్ష సాధింపు చర్యలు అనే ఆరోపణలు దారణం అంటూ చంద్రబాబు నాయుడు కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించేందుకు మీడియా ముందుకు వచ్చినట్లు ప్రభుత్వ ఏజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు.సుప్రిం కోర్టులో చంద్రబాబు కేసు విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు బాబుకు చెంపపెట్టు చంద్రబాబు అరెస్టు విషయంలో ప్రభుత్వంపై టిడిపి చేస్తున్న కక్ష సా ధింపు ర్యలు అనే ఆరోపణలు దారుణం అంటు ప్రభుత్వ ఏజి పొన్నవోలు సుభాకర్‌రెడ్డి మీడియా ముందు ధ్వజమెత్తారు. ప్రభుత్వం రాగద్వేషాలకు అతీతంగా చట్ట ప్రకారం కాకుండా బాబురక్షణ కోసం ఎన్నో చర్యలు తీసుకుందని మీడియా డిబేట్‌లు పఎ ట్టి మరీ మహిళా న్యాయమూర్తిని కూడా చూ డకుండా తప్పుడు మాటలు మాట్లాడారు.చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తాడు అనే పేరు ఉంది.న్యాయవ్యవస్థలు చట్ట ప్రకారం పనిచేస్తే కక్ష సాధింపు చర్యలు అని టిడిపి చెప్పడం దారుణమన్నారు.ప్రభుత్వం సహృదయంతో అపోజ్ చేయలేదు కాబట్టి చంద్రబాబు జైల్లో మ్యాన్యువల్‌లో లేని విధంగా బ్లాక్‌బ్లాక్‌మొత్తం చేసి ఏసీలు మధ్య సకల సౌకర్యాలతో ఉన్నారు.371కోట్ల రూపాయలతో ప్రజాధనం దోచేసిన చంద్రబాబు నోటీసు ఇవ్వలేదనే ఒక చిన్నసాకు చూపి చంద్రబాబు అరెస్టును అక్రమ అరెస్టులు అంటూ ప్రజల్లో తప్పుడు ప్రచారం చేశారు.జీవో ఎమ్ఎస్ 4 కు వ్యతిరేకంగా ఒక తప్పుడు పత్రాలు సృష్టించి 371కోట్లు దోచేశారు.కొన్ని వ్యవస్థలను అడ్డు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని చట్టాలను అపహాస్యం చేస్తే చివరికి సామాన్యులు ఇబ్బంది పడతారు .చంద్రబాబునాయుడు మెడికల్ బెయిల్ పొందిన తర్వాత ప్రభుత్వం సుప్రిం కోర్టుకు వెళ్లి బెయిల్ క్యాన్సిల్ పిటీషన్ వేయలేదు.ఈ ఒక్క విషయం చాలా ప్రభుత్వం రాగద్వేషాలకు పోలేదు అనేదానికి ఉదాహరణ.... చట్టం ముందు అందరూ సమానులే మాజీ ముఖ్యమంత్రి అయినా గతంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కానీ అప్పట్లో మహాత్మా గాంధీ కూడా జైల్లో ఉన్నారు. వారు కూడా జైల్లో ఉన్నారు.వారు కూడా చంద్రబాబు పొందిన సౌకర్యాలు పొందలేదు.అంటూ మీడియా ముందు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోండి

**నెల్లూరు కార్పొరేషన్,జనవరి17,ప్రభాతవార్త** వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి,అర్హులందరికీ పథకాలు వర్తింపచేయాలని నగరపాలక సంస్థ సెక్రటరీ హేమవతి అధికారులకు సూచించారు.స్థానిక రైతుబజార్ సమీపంలోని తోటబడి,స్థానిక జేమ్స్ గార్డెన్,ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచార వాహనం,శిబిరాల ద్వారా అవగాహన క్యాంపులను బుధవారం నిర్వహించారు.క్యాంపులలో కేంద్ర ప్రభుత్వం పథకాల ప్రచారం,అవగా హన, అర్హులైన వారికి రిజిస్ట్రేషన్,ఆధార్ అప్డేట్,పి.ఎమ్ స్వనిధి,ముద్రలోన్,బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, తదితర అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించామని సెక్రటరీ తెలిపారు.కేంద్ర సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు తమ వ్యక్తిగత అను బ వాలు, క్యాంపుల ద్వారా పంచుకున్నారని వెల్లడించారు.స్వాగత కమిటీ,ఉత్సవ కమిటీ,కల్చరల్ కమిటీలను ఏర్పాటు చేసి ఆయా బృందాల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ వరకు నగరపాలక పరిధిలో 8ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై పరిపూర్ణమైన అవగాహన కల్పించి,అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని సెక్రటరీ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సంకల్ప యాత్ర కన్వీనర్లు ఆదినారాయణ,సురేంద్రరెడ్డి,ఆంజనేయరెడ్డి,శ్రీనివాసులు,రాధాకృష్ణగౌడ్,రవిశంకర్,అశోక్,రాజేశ్వరి,విజయశ్రీ,భాస్కర్ వివిధ బ్యాంకుల ప్రతినిధులు,నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



## పంచాయతీ అభివృద్ధి పనులపై శిక్షణ



**వింజమూరు, జనవరి17, ప్రభాతవార్త** : వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృ ద్ధిపనులపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించా రు. ఈకార్య క్రమంలో ఇఓపిఆర్‌డి కామేశ్వరరావ్ పం చాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు , సచివాలయ డిజిటల్ సహాయకులకు అభివ ృద్ధిపనులపై అవగాహన కల్పించారు. పంచాయతీ అభివృద్ధికి నిర్దేశించిన నిధులను ఆమోదించిన పనులకు మాత్రమే ఖర్చు చేయా లన్నారు. ప్రధానంగా తాగు నీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ మరమ్మత్తులు, నూతనరోడ్లు, డ్రైనేజీల ఏర్పా టుకు నిధులు ఖర్చు చేయాలన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఇతర ఖర్చులకు వినియో గిం చాలన్నారు. ప్రతి పనికి సంబంధించిన బిల్లులను అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సూపరెంటెంట్ మురళీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించి అంగన్‌వాడీ కేంద్రాలు తెరిపించాలి




**ఆత్మకూరు, జనవరి17, ప్రభాతవార్త** : గత 40రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడం వలన అంగన్‌వాడీ కేంద్రాలు మూతవేయడంతో చిన్నారులకు సంరక్షణ లేక పోషక లోపం ఏర్పడి ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణీల పరిస్థితి దారుణంగా తయారైందని వెంటనే అంగన్‌వాడీ ల సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నెల్లూరుజిల్లా కులవివక్షత పోరాట సమితిజిల్లా నాయకులు ఆత్మకూరు నాగయ్య పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సి పల్ పరిధిలోని వెంకటర్రావుపల్లి ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. అక్కడ గిరిజన కుటుంబాలతో మాట్లాడారు. ఉదయాన్నే అంగన్‌వాడీ కేంద్రంలో తమ పిల్లల్ని వదిలి పనికి వెళ్ళి మధ్యాహ్నం వచ్చేంతవరకు పిల్లలకు మంచి ఆహారం అందిస్తూ రక్షణగా ఉండేవారని ప్రస్తుతం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో ఉండడం వలన తమ కేంద్రానికి పిల్లల్ని పంపడానికి లేక పిల్లలను వదిలి తమ పనులకు పోలేక ఇళ్ళ వద్దఅల్లాడుతున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలో తెరచి తమ బిడ్డలకు పోషకాహారం అందించడంతోపాటు సంరక్షణ కల్పించాలని గిరిజనులు ఆవేదనతో కోరారని నాగయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ ల సమస్యల పరిష్కారం చేపట్టి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలను , టీచర్లను యధావిధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని లేకుంటే గిరిజన కుటుంబాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని దీనిపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తామని నాయకులు నాగయ్య తెలిపారు.

## మహిళ సాధికారత జగనన్నతోనే సాధ్యం



వరికుంటపాడు, జనవరి 17, ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉన్న మహిళ ఆర్థికంగా బ లోపేతం చేస్తూ , మహిళ సాధికారత జగనన్న తోనే సాధ్యం అయిందనీ ఉద యగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నా రు. బు ధవారం మండలంలోని జి.కొండారెడ్డిపల్లి సచివాలయం పరిధిలో జి.కొండారెడ్డిపల్లి , కొత్తపల్లి గ్రామాల్లో సర్పంచ్ కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, వైకాపా నేత మూలే వీరారెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహిం చిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు ఘన స్వాగతం పలుకారు పలికారు. అనంతరం జగనన్న అందించిన సంక్షేమ పథకాల కరదీపికలను ఆయన మహిళలకుఅందజేసి, పథకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కుల, మతాలకు, పార్టీ లకు అతీతంగా ఇచ్చిన ప్రతి హామీ నేరవేరుస్తున్నారన్నారు. సంక్షేమ ఫథకాలతో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ మ హిళల అభవృద్ధి ఎంతగానో ముఖ్యమంత్రి కృషి చేశారనీ కొనియాడారు. అనంతరం సచివాలయ సిబ్బంది సమీక్ష నిర్వహించి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. అంబేద్కర్ విగ్రహానికి, వైఎస్సార్ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో మాజీ ఎంఎంసి చైర్మన్ షేక్ అలీ అహ్మద్, మండల పార్టీ కన్వీనర్ మండలపు తిరుప తినాయుడు, జెడ్పిటీసీ సభ్యులు రావెళ్ళ నాగేంద్ర, వైఎస్ ఎంపీపీ దేవనబోయిన మధు, ఎంపిడిఓ చేవూరి. శ్రీదేవి, పార్టీ జిల్లా ఈసీ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, నేతలు గవదకట్ల మల్లికార్జు న, నారాయణరెడ్డి, చెన్నరాయుడు, చెన్నకేశవులు, మల్లికార్జున , వైకాపా నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కులగణన పకడ్బందీగా నిర్వహించండి



నెల్లూరుఅర్బన్, జనవరి17, ప్రభాతవార్త ఈ నెల 19నుండి 28వరకు జరిగే కులగణన పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కులగణన జన్‌భగీదరి, స్వతంత్ర దినోత్సవ వేడుకలు, అంగన్వాడీల సమ్మె తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కులగణన సున్నితమైన అంశమని, చేపట్టేటప్పుడు సిబ్బంది ప్రజలతో జాగ్రత్తగా, మార్యదగా వ్యవహరించాలన్నారు. ప్రతి సచివాలయంలో కులగణన చేసే సిబ్బంది ఇంటింటికి తిరిగి ఈకెవైసీ సేకరించాలన్నారు. కులగణనపై గతంలో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వడం జరిగిందని, అయినప్పటికీ గురువారం మరోసామి శిక్షణ ఇవ్వాలని జడ్పీసీఈవోకు కలెక్టర్ సూచించారు. ఈ నెల 19న విజయవాడలో జరిగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక మహాశిల్పం ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుండి సుమారు 5000 మంది హాజరవుతున్నందున వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్, పిడి, డిఆర్డిఏకు సూచించారు. బస్సుల్లో బయులుదేరే వారికి రవాణా, అసవరమైన త్రాగునీరు, అల్పాహారం, భోజనం, ఏర్పాటు చేయడంతోపాటు వారికి తిరిగి గమ్యస్థానాలకు చేర్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే 19వ తేదీన డాక్టర్ బి.ఆర్ అందబేద్కర్ విగ్రహావిష్కరణ ప్రారంభం లైవ్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు తిక్కన ప్రాంగణంలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 26వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘరంగా జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్, డిఆర్ఓఎస్ లవన్న, సీఈఓ చిరంజీవి, పిడిడిఆర్డిఏ సాంబశివారెడ్డి, పిడిఐసిడిఎస్ హేనసుజన్ తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

**ఆత్మకూరు, జనవరి17, ప్రభాతవార్త** : ఆత్మకూరు పట్టణంలో సంక్రాంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలోనాలుగురోజుల పాటు ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం ఫైనల్లో గెలుపొందిన క్రికెట్ టీమ్ విజేతలకు బిఎస్ఆర్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ షకీలా విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం బహుమతులు అందజేసిన డాక్టర్ షకీలా ను డివైఎఫ్ఐ నాయకులు, ఇతర సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై మొద్దు కత్తితో దాడి చేసిన గొట్టెటి



కావలి, జనవరి 17 ప్రభాతవార్త కావలి పట్టణ పాత వూరు జొన్నాయిగుంటలో నివసిస్తున్న గార్ల వెంకట శైలజపై పాతవూరు వైసిపి నేత అనుచరుడు గొట్టెటి హనుమంతరావు మొద్దు కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన శైలజ కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతుంది. ఈ దాడికి పాతకక్షలే కారణమని పోలీసులు చెబుతున్నారు. బాధితురాలు కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. గొట్టెటి హనుమంతరావు కుటుంబ సభ్యులు తరచుగా వివాదాలకు దిగుతూ భయకంపితుల్ని చేస్తున్నారన్నారు. కోర్టులో కేసులు నడుస్తున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో హనుమంతరావు, కుటుంబ సభ్యులు మొత్తం నలుగురు మమ్మల్ని చంపేందుకు వచ్చారన్నారు. ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఆమె పోలీసులను వేడుకుంటున్నారు.

## పోకూరులోఎన్టీయార్ విగ్రహావిష్కరణ



**వలేటివారిపాలెం జనవరి 17, ప్రభాతవార్త** మండలంలో బుధవారం దివంగత ఎన్టీయార్ విగ్రహావిష్కరణ కార్య క్రమం వేలాది మంది కార్యకర్తల మద్య అట్టహాసంగా నిర్వహిం చా రు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిప్రకాశం జిల్లా లోని సీనియర్ తెదేపా నేతల, అతిరధమ హారధులంతా పాల్గొన్నారు. వీరిని ఘనంగా ర్యాలీగా వచ్చి స్దానిక నేతలు అభిమానులు స్వాగతించిరాఉ. స్వర్గీయ ఎన్టీయార్ విగ్రహా నికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు తెదేపా ఇన్ చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నూకసాని బాలాజి, ఉన్నం నళినీదేవి, దివిశివరామ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చీరాల తెదేపా ఇన్‌చార్జీ ఎంఎం కొండయ్య, పార్టీ అధికార ప్రతినిధి మహేసేన రాజేష్, మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుంది



ఉలవపాడు, జనవరి17, ప్రభాతవార్త తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు)ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ ఇందిరావతి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిక చేశారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ఉలవపాడు ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద అంగన్వాడీల సమ్మెలో భాగంగా 37వ రోజు శిభిరం కోనసాగింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ అంగన్వాడీలు నినాదాలు ఇచ్చారు. సమ్మె శిభిరాన్ని ఉద్దేశించి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ ఇందిరావతి మాట్లాడారు. విశాఖపట్నంలో రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గెస్ట్‌హౌస్ నిర్మాణానికి 450కోట్లు ఖర్చు చేసిందని, అంగన్వాడీలకు 300కోట్లు చేస్తే 3000వేతనం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు ఉన్నా అంగన్వాడీల వేతనాలు పెంపుకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదో తెలపాలన్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించకపోతే ఉధ్యమం ఉధృతం అవుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమ్మెలో అంగన్వాడీల ఆందోళనలో ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల అంగన్వాడీలు, కార్యకర్తలు, హెల్పర్లు, పాల్గొన్నారు.

## పుస్తకాలతో మరింత విజ్ఞానం

ఉలవపాడు, జనవరి17, ప్రభాతవార్త పుస్తకాలతో మరింత విజ్ఞానం దక్కుతుందని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందని ఉలవపాడుశాఖ గ్రంధాలయ భవన దాత కోటిరెడ్డి సుచరిత రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రంధాలయాన్ని ఆమె సందర్శించడం జరిగింది. సంక్రాంతి సందర్భంగా ఉలవపాడు విచ్చేసిన ఆమె ముందుగా గ్రంధాలయ ఆవరణంలోనిదేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా పేదవారికి వస్త్రదానం చేశామని ఆమె తెలిపారు. గ్రంధాలయ భవనానికి దాని అభివృద్ధికి ఆమె సహకారం ఎనిలేనిదని వారికి వారి కుటుంబసభ్యులందరికీ ఉలవపాడుశాఖ గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు చేజర్లలలో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు



**చేజర్ల జనవరి 17 ప్రభాతవార్త** మండలకేంద్రమైన చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో నేడు గురువారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు మండలధ్యక్షులు రావి లక్ష్మి నరసారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీ కన్నబాబు హాజరౌతున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు , ఎన్‌టిఆర్ అబిమానులు , బాలకృష్ణా అభిమానులు పాల్గోనాలని పిలుపునిచ్చారు. అనంతం వేడుకలకు వచ్చిన వారందరికి మధ్యహ్నం అన్నదాన కార్యక్రమాం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం పార్టీనా యకులు, కార్యకర్తలు అభిమానులు హాజరౌతున్నట్లు తెలిపారు.

## ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలి



**కావలి, జనవరి 17 ప్రభాతవార్త** ప్రజలందరు సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఆనందంగా జీవించాలని సర్వాయపాళెం కలుగోళ శాంభవి అమ్మవారిని కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టిడిపి నేత దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ప్రార్ధించారు. కావలి రూరల్ మండలం సర్వాయపాళెంలోని కలుగోళ శాంభవి అమ్మవారి గ్రామోత్సవంలో కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు బొకెలతో, గజ మాలలతో, శాలువాలతో కావ్యను ఘనంగా సత్కరిం చారు. గ్రామ పొలిమేర్ల నుండి ఆయనను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్ధప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. సర్వాయ పాళెం ప్రాంత ప్రజలు తనకెంతో ఆప్తులన్నారు. ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తానన్నారు.

## అంగన్‌వాడీలకు చేయూత



**వరికుంటపాడు, జనవరి 17, ప్రభాతవార్త** : గత కొన్ని రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన కార్యాక్రమాలు చేపడుతున్న అంగన్‌వాడీ కార్య కర్తలు, ఆయాల దీక్ష బుధవారం మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపి వారికి 20 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల వా రిని ప్రభుత్వం నట్టేట ముంచిందని, నెల రోజులుకు పైగా మహిళలు రోడ్డు పైకి నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఈ కార్యక్రమములో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రజీయా మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మినారాయణ , నేతలు చంద్రా వెంకయ్య, మహేష్, రాజా, మానం కొండలరావు, తాతపూడి లాభాన్, నందిపాటి ఆరోన్, గుర్రం గోపి, కామెపల్లి శ్రీనివాసులు, ఆరికొండ వెంకటరత్నం తదితరులు

## మండలస్థాయి జిపిడిపి శిక్షణ కార్యక్రమం



ఉలవపాడు, జనవరి17, ప్రభాతవార్త స్థానిక వనరుల లభ్యత మేరకు ప్రజల భాగస్వామ్యంతో వాసవిక ప్రణాళికలు రూపొందించడమే జిబిపిడి విధానమని ఉలవపాడు ఎంపిడివో విజయ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా ప్రణాళిక ప్రకారం జిబిపిడి మండలస్థాయిశిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రణాళిక రూపకల్పన నుండి పనులు అమలు పర్యవేక్షణ, సామాజిక తనిఖీ మొదలైన అంశాలతో కూడిన సమగ్ర విధానమే జిడిపిడి అని ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం ద్వారా పొందగలిగే అన్ని సౌకర్యాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందజేయడం రాజ్యాంగ స్ఫూర్తితో లభ్యమైయ్యే వనరులన్నిటిని ప్రజలకు అందుబాటులోకి తేవడం అందరికీ సమాన సమావేశాలు కల్పించడం అనే అంశాలపై ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి చెంచమ్మ, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్నమ్మ ఒడిలో ఘనంగా గొబ్బెమ్మల పండగ



పోటోలు :నందా మాల్యాద్రి

## వాలింటర్స్‌ను సత్కరించిన కౌన్సిలర్ ప్రమీలమ్మ



బుచ్చి జనవరి 17 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని 16 వవార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ వాలింటర్స్‌ను సన్మానించి వారికి చీరలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సంక్రాంతి పురస్కరించుకొని వాలింటర్లకు చీరలు బహుకరించడం జరిగిందని ఆమె తెలిపారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ నేతృత్వంలో వాలింటర్లు బాగా పనిచేస్తున్నారని ఆమె అభినందించారు. ప్రజలకు వాలింటర్ల చేస్తున్న సేవలు అద్భుతమని ఆమె ప్రశంసించారు. ఈకార్యక్రమంలో వాలింటర్లు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే గ్రామాభివృద్ధి



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త :** పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయడంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు , సర్పంచ్‌లకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకుని అమలు పరిచే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే వివిధ స్థాయిలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ అభివృద్ధి ప్రణాళికలను స్థానిక సమస్యలు, స్థానిక పరిష్కారాలు అనే దృక్పదంతో ప్రజల భాగస్వామ్యంతో అందుబాటులో ఉన్న వనరులతో ప్రజల అవసరాలను ఎంపిక చేసుకుని ప్రధాన్యతకు అనుగుణంగా పారదర్శకంగా తయారు చేయాలన్నారు. ముఖ్యంగా ఈ ప్రణాళికలు రూపొందించడంలో ప్రజలు సంబంధిత సచివాలయ ఉద్యోగులు సమిష్టిగా కూర్చోని గ్రామాభివృద్ధికి అవసరమైన మేర వీటిని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్‌లు ఈ అభివృద్ధి ప్రణాళికలను ఏ విధంగా రూపొందించుకోవాలో వీడియో ద్వారా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రహీమ్, తదితరులు ఉన్నారు.

## మండలస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త :** కోవూరులోని కొత్తూరు గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఎంపీడీవో శ్రీహరి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలకు సంబంధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రికెట్ జట్టు నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర పోటీలకు పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రహీమ్, ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, డెలీలా, పీఈటీలు వెంకటసుబ్బమ్మ, జాన్సన్, ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో యూరియా కొరత ఎక్కడా లేదు



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులకు ఈ సీజన్‌కు సంబంధించి ఎరువుల సమస్య లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలో ఐదు మండలాలకు సంబంధించిన వ్యవసాయాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యవసాయాధికారి పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు ఎంతమేర అవసరం అవుతాయో ఇండెంట్ పెట్టి వెంటనే తెప్పించుకోవాలన్నారు. ఈ మూడు రోజుల్లో పడుగుపాడు రైల్వే యార్డ్‌కు మూడు రేక్‌లు వచ్చాయన్నారు. ముఖ్యంగా ప్రతి వ్యవసాయాధికారి వారి వారి పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను, ఎరువుల డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. ఏ రోజు ఎరువుల అమ్మకాలను ఆ రోజే ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఎరువులు విక్రయించే షాపుల వారు తప్పనిసరిగా షాపు బయట నోటీసు బోర్డు ఏర్పాటు చేసి అందులో ఎరువుల స్టాక్ వివరాలు, ధరలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా రైతుల్లో ఈ క్రాప్, ఈకేవైసీ నమోదుపై మరింత అవగాహన పెంచేలా మండల వ్యవసాయాధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత , నర్సోజీ శేషగిరిరావు, మండల వ్యవసాయాధికారులు ఇందిరావతి, సురేంద్రరెడ్డి, శ్రీలక్ష్మి, వెంకటకృష్ణయ్య, టెక్నికల్ ఏవో మేరీ కమల, శ్రీహరి, తదితరులు ఉన్నారు.

## నేడు ఎన్టీఆర్ వర్ధంతి



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నేత ఎన్టీ రామారావు 28వ వర్ధంతిని పురస్కరించుకుని కోవూరులోని పెళ్లకూరు కాలనీ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి తెలిపారు. ఈ కాలనీ సెంటర్ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన రహదారిలో వెలసి ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రాంగణంలో సంక్రాంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఆలయంలో పడుగుపాడు సహకార సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగనన్నకు చెబుదాం కోటి సంతకాలకు శ్రీకారం చుట్టిన అంగన్వాడిలు



**కావలి, జనవరి 17 ప్రభాతవార్త :** జగనన్నకు చెబుదాం అనే కోటి సంతకాల ఉద్యమానికి అంగన్వాడీలు, హెల్పర్లు శ్రీకారం చుట్టారు. కావలి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు, హెల్పర్లు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరింది. అంగన్వాడీల, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ఐయంఎ గౌరవాధ్యక్షులు, వివిధ సంఘాల బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ తొలి సంతకం చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంగన్వాడీలు, హెల్పర్లు చేస్తున్న పోరాటం భావితరాలకు దిక్సూచి అని తెలిపారు. జరగబోయే పోరాటాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. 37 రోజులు ఐక్యంగా పోరాడటం చాలా గొప్ప విషయమన్నారు. జగన్ ప్రభుత్వం అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. మీ డిమాండ్లు సాధించేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలని డాక్టర్ బెజవాడ రవికుమార్ పిలుపునిచ్చారు. మీ పోరాటానికి మా అండ ఎప్పుడు వుంటుందన్నారు. ఈ శిబిరంలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం. మోహన్‌రావు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. సమ్మెలోకి వెళ్తామని అంగన్వాడీలు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా అంగన్వాడీలపై ప్రభుత్వం రకరకాల బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. ఎస్మా చట్టాన్ని ఉపయోగించి పోరాటాలను అణిచివేయాలని ఉద్యోగాలు తీసివేస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దిగిందన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత పాలనలో కలం పోటుతో ఉద్యోగాలు పీకివేయడంతో తర్వాత జరిగిన ఎన్నికలలో అధికారం నుండి ఆమెను ఇంటికి పంపారని గుర్తు చేశారు. కోర్టుకు వెళ్లి అందరూ ఉద్యోగాలు తెచ్చుకున్న చరిత్ర వుందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు గుర్రాలతో తొక్కించడంతో ఆయన కూడా అధికారానికి దూరమయ్యాడన్నారు. ఈ చరిత్రల్ని జగన్‌రెడ్డి తెలుసుకోవాలని హెచ్చరికలు చేశారు. అంగన్వాడీల కోర్కెలు తీరేంత వరకు సిపియం, సిఐటియు అండగా వుంటుందన్నారు. బెదిరింపులకు పాల్పడితే ఈ ప్రభుత్వం కూడా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, టి. మాల్యాద్రి, వై. కృష్ణమోహన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు యం. రమాదేవి, బి. శ్రీదేవి, జనవిజ్ఞాన వేదిక నాయకులు పి. జానకిరాం, హరినారపరెడ్డి, మాజీ ఎంఇవో కల్లయ్య, సిపియం పార్టీ నాయకులు బి. మధుసూదన్‌రావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రఘురావమ్మ, విజయలత, వజ్రమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఆదరణ కేంద్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**బిట్రగుంట, జనవరి 17 ప్రభాతవార్త :** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో బుధవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కావలి స్నేహ జూనియర్ కళాశాల 2014-16 ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని అనంతరం ఆదరణ కేంద్రంలోని అనాథలకు నిత్యావసర వస్తువులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె. సింహాద్రిరావు, పూర్వ విద్యార్థులు సంధ్య, భువన, మహిత, మురళి, గౌస్, మహేష్, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ కార్యకర్తను పరామర్శించిన పసుపులేటి



**బిట్రగుంట, జనవరి 17 ప్రభాతవార్త :** బోగోలు మండలం కప్పరాళ్ళతిప్పకు చెందిన గోగుల సురేష్ కుమారుడు సునీల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కావలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండటంతో పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్‌రావు పరామర్శించారు. సునీల్ ఆరోగ్యంపై వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబానికి తాను ఎప్పుడు అండగా వుంటానని హామీ ఇచ్చారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**బిట్రగుంట, జనవరి 17 ప్రభాతవార్త :** యువత క్రీడల్లో రాణించి క్రీడలు ఆడుతూ దేహారోగ్యాన్ని కాపాడుకోవాలని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్‌రావు తెలిపారు. మండలంలోని వడ్డిపాళెంలో జరిగిన కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి కావలిని కనకపట్నంగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## పలు ఆలయాల్లో పసుపులేటి ప్రత్యేక పూజలు



**కావలి రూరల్, జనవరి 17 ప్రభాతవార్త :** కావలి మున్సిపాల్టీ పరిధిలోని బుడమగుంటలో ఐదు దశాబ్దాల క్రితం వెలసియున్న పురాతనమైన జానకిరామలింగేశ్వరస్వామి పునఃప్రతిష్ట సందర్భంగా పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ ఆలయాన్ని సందర్శించి పునఃప్రతిష్ట కార్యక్రమానికి సంబంధించిన పూజల కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం కావలి రూరల్ మండలం సర్వాయపాళెంలో వెలసియున్న కళుగోళ శాంభవి అమ్మవారిని పసుపులేటి సుధాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు వుండాలని కోరారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

## బాధిత కుటుంబానికి తక్షణ సాయం



**అనుమసముద్రంపేట, జనవరి17, ప్రభాతవార్త :** మండలంలోని ఏఎస్‌పేట హైస్కూల్ రోడ్డు వీధికి చెందిన మల్లూరు శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మ ృతి చెందారు. అతని కుటుంబానికి వైఎస్ఆర్ ప్రమాద భీమా తక్షణ సహాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న మొదటి విడత 10వేల రూపాయల నగదును బాధిత కుటుంబానికి సర్పంచ్ షేక్ తాజున్నీసా జిలానీబాషా బుధవారం అందజేశారు. ఈకార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మహేంద్ర పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా షర్మిల నియామకం హర్షదాయకం



**నెల్లూరుటౌన్, జనవరి 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియామకం చేయడం హర్షదాయకమని అందుకు తాము హృదయ పూర్వకంగా స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, పీసీసీ సభ్యులు తలారి బాల సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్టీలోకి షర్మిల రాకతో గత వైభవంగా పునరావృతం అవుతుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేకూర్చేందుకు దీంతో పాటు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి పూర్వ వైభవాన్ని పునరావృతం చేసి పార్టీకి అండగా నిలిచేందుకు వైఎస్ షర్మిల కృషి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. సామాన్యుడిని ఉన్నత స్థాయిలో గౌరవించడం అలాగే దూరదృష్టితో రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ హర్షించదగ్గ నిర్ణయాలను తీసుకొని చారిత్రాత్మక ఆశక్తిగల రాజకీయాలను చేయడంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ రాజకీయాలను చేయడంలో సరిపోటి కలిగిన రాజకీయ పార్టీలు దేశంలో, రాష్ట్రంలో ఖచ్చితంగా లేవని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పదవి బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు ఎనలేని సేవలను అందించినందుకు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ స్థాయిలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నిక చేసినందుకు జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గేకి, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఎన్నికైన వైఎస్ షర్మిల కూడా ప్రస్తుత రాజకీయ పార్టీలు ప్రజల్ని చిన్నాభిన్నం చేస్తున్న తీరును రాష్ట్ర ప్రజలకు అర్ధమయ్యే రీతిలో బహిర్గం చేసి మహానేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగుతూ కాంగ్రెస్ పార్టీకి విశిష్ట కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రామాల అభివృద్ధికై తీర్మానాలు చేయండి



**ఉదయగిరి, జనవరి17, ప్రభతవార్త :** ఉదయగిరి మండలంలోని ఎంపిడివో కార్యాలయ ఆవరణంలో గల స్త్రీశక్తి భవన్‌లో ఈ వోపిఆర్డి మల్లికార్జున గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడిన ఆయన మండలంలోని 17పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి అవసరమైన తీర్మానాలు చేయాలని చెప్పారు. సంబంధిత వివరాలను జనవరి 31వ తేదీలోపు ఎంపిడివో కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు వసరమైన పనులకు సంబంధించిన చేసిన తీర్మానాలకు మాత్రమే నిధులు మంజూరవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపిడివో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో విధుల్లో చేరిన అంగన్వాడీలు



**ఉదయగిరి, జనవరి17, ప్రభతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరిలోని ఐసిడిఎస్ పరిధిలో నాలెగె మండలాల 208అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి 108అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది విధుల్లో చేరినట్లు సిడిపిఓ పచ్చుల లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాటు, సీతారామపురం, దుత్తలూరు మండలాల్లో మినీ మెయిన్ అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి సిబ్బంది విధుల్లో చేరుతున్నారని తెలిపారు. అత్యధికంగా వరికుంటపాడు మండలానికి సంబంధించిన 50సెంటర్లకు సిబ్బందికి గైర్హాజరు అయినట్లు తెలిపారు. మిగిలిన వారు కూడా విధులకు హాజరై, గర్భవతులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య దృష్టా వారికి సేవలందించాలని కోరారు. 108కేంద్రాల సిబ్బంది విధుల్లో చేరుతున్నట్లు లిఖితపూర్వక హామీలిచ్చారని తెలిపారు.

## ఉదయగిరి వాసులకు వైసీపీలో దక్కిన పదవులు



**ఉదయగిరి, జనవరి17, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరి వాసులకు వైసీపీలో జిల్లా పదవులు లభించాయి. ఎంతో కాలంగా పార్టీకి విధేయులమై పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తమనుగౌరవించి తమకి సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి అందుకు కృషి చేసిన ఉదయగిరి సమన్వకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఉదయగిరి పట్టణంలోని ఓబిఎమ్ చర్చిలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ లక్కినేని అశోక్‌కుమార్‌కు క్రిస్టియన్ మైనార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా లక్కినేని స్మార్ట్‌కు, ఐటివింగ్ జిల్లా సెక్రటరీగా ఎన్. ప్రసాద్‌కు, క్రిస్టియన్ మైనార్టీ జాయింట్ సెక్రటరీగా పదవులు ఇవ్వగం జరిగిందని చెప్పారు. పదవులు దక్కిన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, ఉప్పుటూరి శ్రీను, ఇత్తడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాటల సీడీ ఆవిష్కరణ

**నెల్లూరు జనవరి 17, ప్రభాతవార్త-విద్య :** స్కాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ ఏ విజయ్‌కుమార్ అధ్యక్షతన నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో, జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఖాలేషాబాషా జనవిజ్ఞానవేదిక విజ్ఞాన గీతాల సీడీని బుధవారం ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా ఖాలేషాబాషా మాట్లాడుతూ వచ్చేనెల ఫిబ్రవరి మొదటివారంలో జరగనున్న రాష్ట్ర కళాజాత నేపథ్యంలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడం కోసం ఈ విజ్ఞాన పాటలను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు పార్వతీశం, సుబ్రమణ్యం, గోపినాథ్‌లు ఆవిష్కరించిన గీతాలను పాడారు. జెవివి ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, యుటిఎఫ్ చలపతిశర, ప్రజానాట్యమండలి శేషయ్య, సాహితీ స్రవంతి, గోపి, పిపిసి డాక్టర్ శీనానాయక్, డాక్టర్ రఫీ, బుజ్జయ్య, విద్యాచరణ్, విజయమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన భరత నాట్యం



**బిట్రగుంట, జనవరి 17 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలు రాజ వీధిలోని స్వర్గీయ అమర బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ షిర్డీ సాయి మందిరంలో చిన్నారులు కీర్తన,దీక్షిత్ చౌదరిల భరత నాట్యం ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. షిర్డీ సాయి మందిరంలో సంక్రాంతిని పురస్కరించుకుని సాయి సేవకుల నేతృత్వంలో జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి మందిర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారుల భరత నాట్యం ఆకటుకోవడంతో పాటు పలువురి ప్రశంసలు అందుకుంది.

## మెడికవర్‌లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం




**నెల్లూరు జనవరి 17, ప్రభాతవార్త-వైద్యం** బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒ మహిళకు బోన్‌మారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడామని మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ హెడ్ డాక్టర్ బిందుభార్గవి రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని ఆ ఆసుపత్రిలో జరిగిన విలేఖరుల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కర్నూలుజిల్లాకు చెందిన గోవిందమ్మ అనే మహిళ క్యాన్సర్‌తో బాధపడుతూ వేరే ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుందన్నారు. మెరుగైన చికిత్సకోసం ఆమె మాఆసుపత్రికి రావడం జరిగిందన్నారు. ఇక్కడి మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ ఆమెకు అన్ని రకాల పరీక్షలు చేసి బోన్‌మాన్ ప్లాంటేషన్ చేయడంవల్ల జబ్బుని పూర్తిగా తగ్గించవ్చని గుర్తించామన్నారు. సుమారు రూ.10లక్షల వరకు ఖర్చు అయ్యే శస్త్రచికిత్సను రోగి పేదరికాన్ని అర్థం చేసుకుని ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా చికిత్స అందిచామన్నారు. రోగికి కీమోథెరపీ తరువాత స్టెమ్‌సెల్ ఇన్‌ఫ్యూషన్ చేసి రోగిని డిశ్చార్జ్ చేశామన్నారు. నెల్లూరులో తొలిసారిగా బోన్‌మారో ప్లాంటేషన్‌ని ప్రారంభించిన మూడునెలల్లోనే రెండో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయడం జరిగిందన్నారు. ఇక్కడ అత్యాధునిక వైద్య సౌకర్యాలు కలిగిన క్యాన్సర్ ఆసుపత్రి ఉండడంతోనే ఇది సాధ్యం అయిందన్నారు. నెల్లూరుతోపాటు ఇతర జిల్లాలవాసులకు ఎంతో ఈ ఆసుపత్రి ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మండవ వెంకట్రావుకు ఘనసత్కారం



**కావలి రూరల్, జనవరి 17 ప్రభాతవార్త** స్వర్గీయ మండవ కుటుంబరావు స్ఫూర్తితో విజయవాడలో జరిగిన మండవ వారి 10వ ఆత్మీయ సమ్మేళనంలో మండవ ఇంటి పేరు గల కుటుంబ సభ్యులు, వివిధ రంగాలలో వున్న మండవ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారివారి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వివిధ రంగాలలో వుండి సేవలు చేస్తున్న మండవ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. అందులో భాగంగా గత కొన్ని సంవత్సరాలుగా ఒకే పార్టీలో వుంటూ దివ్యాంగుల హక్కులను సాధిస్తూ, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందిన కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతి భావంతుల మండవ వెంకట్రావును సత్కరించారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, విశ్రాంత డిజిపి మండవ విష్ణువర్దన్, మండవ కుటుంబ సభ్యుల అధ్యక్షులు మండవ గౌతం, ఇండియన్ షుగర్ ఉత్పత్తి తయారీదారుల సంఘం బాధ్యులు మండవ ప్రభాకర్, నూజివీడు సీడ్స్ బాధ్యులు మండవ రామయ్య, కృష్ణదేవరాయ విశ్రాంత వైస్ ఛాన్సలర్ మండవ బసవేశ్వరుడు, దశబల్లా గ్రూప్ హోటల్ అధినేత మండవ రాఘవేంద్రరావు, పారిశ్రామిక వేత్త మండవ వెంకరత్నంలు మండవ వెంకట్రావుకు పూలబొకె అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది.

## బ్రహ్మోత్సవాల వేలం పాటల ద్వారా 52.40 లక్షల ఆదాయం



**బిట్రగుంట, జనవరి 17 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వేలం పాటల ద్వారా 52 లక్షల 40 వేల రూపాయలు ఆదాయం లభించినట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, ఇవో అరవ రాధాకృష్ణలు తెలిపారు. ఈ ఏడాది మార్చి 19వ తేది నుండి 25వ తేది వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. ఇందులో కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కుకు, పాదరక్షలు భద్రపర్చుకునే హక్కుకు, ఆవు పేడ సేకరించే హక్కుకు వేలం పాటలు వాయిదా పడ్డాయి. బ్రహ్మోత్సవాల సమయంలో, అనంతరం తదుపరి సంవత్సర కాలంలో జరిగే వేలం పాటలకు సంబంధించి 52 లక్షల 40 వేల రూపాయలు ఆదాయం లభించినట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 7 లక్షల 27 వేల రూపాయలు అదనంగా ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి టెంపుల్స్ గ్రూప్ ఇవో కృష్ణప్రసాద్, యానాదయ్యతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక పెద్దలు హాజరయ్యారు.

## రావూస్‌లో టిసిఎస్ ఉద్యోగమేళా



**నెల్లూరు,జనవరి17 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కార్పోరేట్ సంస్థ టిసిఎస్ జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం మోగా జాబ్‌మేళాను నిర్వహించింది. ఈ ఉద్యోగమేళాలో ఫైనల్ రౌండ్‌కు చేరుకున్న సుమారు 300 మంది అభ్యర్థులకు సంస్థ హెచ్‌ఆర్ అవినాష్, వారి సిబ్బంది వ్రాత పరీక్ష, గ్రూపు డిస్కషన్స్, నిర్వహించారు. ఈ సందర్భంగా రావూస్ విద్యాసంస్థల డైరెక్టర్ వై.శివ సంకేత్ మాట్లాడుతు టిసిఎస్ సంస్థ తమ విద్యాసంస్థలను నమ్మి ఉద్యోగ ఎంపికలకోసం అవకాశం ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే తమ సంస్థ ద్వారా అనేక మందికి ఉపాది అవకాశాలు కల్పించామని, రానున్న రోజుల్లో ఇటువంటి ఎంపికలను మరిన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. టిసిఎస్ సంస్థ హెచ్‌ఆర్ అవినాష్ మాట్లాడుతు ఉద్యోగాలకుఎంపికైన అభ్యర్థులకు ఈ మెయిల్స్ ద్వారా నియామక పత్రాలు అందిస్తామన్నారు. తమకు అన్నీ విధాల సహాయ సహకారాలు అందించి రావూస్ విద్యాసంస్థల నిర్వాహకులకు వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఈఓ ఎన్.శివారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పొదలకూరుకు మంత్రి కాకాణి రాక

**పొదలకూరు జనవరి 17 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పొదలకూరులో పర్యటిస్తారని వైసిపి అధికార వర్గం తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని మొగళ్లూరు గ్రామంలో అసైన్‌మెంట్ పట్టాలు పంపిణి కార్యక్రమం సిసిరోడ్లు మరియు డ్రైనేజి కాలువల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వైసిపినాయకులు,అభిమానులు పాల్గోనాలని వైసిపి అధికార వర్గం చెప్పారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**మర్రిపాడు ,జనవరి17,ప్రభాతవార్త** : మర్రిపాడు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వ హించారు. ఈకార్యక్రమంలో గురువులను పూర్వ విద్యార్థులు ఎంతో సంతోషంగా ఘనంగా సన్మానించారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో 2007-2008 సంవత్సరంలో 10వ తరగతిని పాఠశాలలో అభ్యసించిన విద్యార్థిని, విద్యార్థులందరూ ఒకే వేదిక వద్దకు చేరుకొని ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ ఉపాధ్యాయులతో అప్పుడు చేసిన చిలిపి చేష్టలు గుర్తు చేసుకుంటూ రోజ ంతా తిరిగి మునుపటి బాల్యంలోకి వెళ్ళి పో యారు. అప్పటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. అందరూ కలసికట్టుగా చేతిలో చేయి వేసుకొని గుర్తున్నవారిని , గుర్తులేని వారిని గుర్తు తెచ్చుకుంటూ అప్యాయంగా పలకరిం చు కుంటూ పాఠశాలలో చక్కర్లు కొట్టారు. సుమారు 15సంవత్సరాల క్రితం చదివిన విద్యార్థిని, విద్యార్థులు , గురువులు మళ్ళీ అదే పాఠశాలలో ఒకే దగ్గర కలసుకోవడంతో ఒకరితో ఒకరు సెల్ఫీ తీసుకుంటూ వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఎక్కడెక్కడినుంచో వచ్చి ఈకార్యక్రమంలో పాలు పంచుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని దేశానికి నలుమూలలా జీవనాధారం రీత్యా ఎక్కడెక్కడో జీవిస్తున్న తమను ఈ వేదిక దగ్గర కలిపేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈక్రాప్ , ఈకేవైసీ నమోదు ఫిబ్రవరి 3 లోగా పూర్తి కావాలి



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త** : వ్యవసాయం సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకోవడం ద్వారా వారికి అనేక ఉపయోగాలు ఉన్నాయని, ఈ విషయంలో వారికి మరింత అవగాహన కల్పించేలా గ్రామ వ్యవసాయ సహాయకులు తగు చొరవ తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏవో వీఏవోలు వారికి ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తికావాలన్నారు. లేనిపక్షంలో నిర్లక్ష్యం వహించే వారి పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆర్‌బీకేలలో ఎరువులు అందించే విషయంలో పాస్ బుక్, సీసీఆర్‌సీ కార్డుల ప్రకారం ఎరువులను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఆర్‌బీకేలలో ఎరువుల అమ్మకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా బకాయిలు లేకుండా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాల మూలంగా రైతులు వేసిన పంట నష్టపోతే ఈ క్రాప్, ఈకేవైసీలో నమోదు చేసుకుంటేనే వారికి నష్టపరిహారం వచ్చే అవకాశం ఉంటుంద న్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ క్రాప్, ఈకేవైసీకి సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన రైతులు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడమే కాకుండా విచక్షణా రహితంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు రైతులు చల్లకుండా వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో సాగు చేసే రైతులు అమ్మోనియం సల్ఫేట్‌ను వాడరాదన్నారు. ప్రస్తుతం వరిలో అక్కడక్కడ ఎండుటాకు తెగులు సోకి ఉందని, దీని నివారణకు గానూ రైతులు ప్రాపికొనజోల్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ పిచికారి కార్యక్రమాన్ని చిరుపొట్ట దశలో ఒకసారి, కంకి దశలో ఒకసారి చేసుకోవాలన్నారు. అదేవిధంగా నానో యూరియా వాడకంపై రైతుల్లో అవగాహన కల్పించేలా గ్రామ వ్యవసాయ సహాయకులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత , నర్సోజీ శేషగిరిరావు, మండల వ్యవసాయాధికారులు ఇందిరావతి,సురేంద్రరెడ్డి, శ్రీలక్ష్మి, వెంకటకృష్ణయ్య, టెక్నికల్ ఏవో మేరీ కమల, శ్రీహరి, తదితరులు ఉన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలను మరువరాదు



**కోవూరు జనవరి 17 ప్రభాతవార్త** : సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహిళలు ఎంతో ఉత్సాహంగా ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొని సంస్కృతి, సాంప్రదాయాల పట్ల వారికి ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయలేదని ట్రైనీ డీఎస్పీ హేమలత అన్నారు. కోవూరులోని కోనేటి కయ్యలు ప్రాంతంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ది లైట్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ గత సంవత్సరాలుగా ఆనవాయితీ తప్పకుండా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. ఆకట్టుకునే విధంగా రంగవల్లులు తీర్చిదిద్దిన మహిళలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మదన్‌రెడ్డిలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.ఫౌండేషన్ సభ్యులు గౌతమ్, తన్మయ్, భరత్‌కుమార్, చక్రి, శ్యామ్, వేణు, తేజ, తదితరులు ఉన్నారు.

## పార్టీ జెండాను ఆవిష్కరించిన బిజెపి నాయకులు



**ఉదయగిరి,జనవరి17,ప్రభతవార్త** ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు ఎమ్ ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడమాల రమేష్‌రెడ్డి కార్యనిర్వహణ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ బిజెపి సీనియర్ నాయకులు నడ్డా ఆధ్వర్యంలో భారతదేశం యొక్క అభివృద్ధి జరుగుతుందని అదేవిధంగా రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో కూడా బిజెపి పార్టీ తన స్థానాన్ని నిలబెట్టుకుటుందన్నారు.రాబోయే రోజుల్లో బిజెపి కార్యకర్తల సమ్మేళనసమావేశాలు నిర్వహించి బిజెపి పార్టీ ఇస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బిజెపిలో చేరారు.బిజెపిపార్టీ ఆశయాలను నమ్మి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బేరి విష్ణువర్ధన్‌రెడ్డి,ఉదయగిరి నియోజకవర్గ కన్వీనర్ కదిరివెంకట రంగారావు,దుత్తలూరు కన్వీనర్ చుండి హరిగోపాల్‌రెడ్డి,రాష్ట్రకార్యవర్గసభ్యులు ఆవుల రోశయ్య,బిజెపి సీనియర్ నాయకులు వెంకటస్వామి నాయుడు,మేకపాటి మాల్యాద్రి నాయుడు,చింతలచెరువు వెంకటాద్రి,నారాయణాద్రి, మాధవరెడ్డి,శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఆర్వో మృతదేహానికి నివాళులర్పించిన కావలి ఆర్డీవో

**అల్లూరు, జనవరి 17 ప్రభాతవార్త** అల్లూరు ప్రాంతానికి చెందిన బండ్ల పుల్లారావు(46) విఆర్వోగా దగదర్తి మండలంలో పనిచేస్తూ మంగళవారం అర్ధరాత్రి ఆఫీసు నుండి ఇంటికి వెళ్తుంగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.ఈ విషయం తెలుసుకుని అల్లూరులోని మృతుడు పుల్లారావు నివాసంలో మృతదేహాన్ని కావలి ఆర్డీవో శీనానాయక్ సందర్శించి నివాళులర్పించారు. ఆర్డీవో వెంట అల్లూరు తహశీల్దార్ చంద్రశేఖర్,దగదర్తి తహశీల్దార్‌లు పాల్గొన్నారు. గతంలో అల్లూరు, విడవలూరు విఆర్వోగా పుల్లారావు పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు.




## వైసీపీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మేకపాటి



**ఉదయగిరి,జనవరి17,ప్రభతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరి పరిధిలోని పుల్లాయపల్లి గ్రామంలో వైసీపీ ఆత్మీమ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైసీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుల్లాయపల్లి వైసీపీ నాయకుడు ఖంబాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూరు,హైదరాబాద్ నగరాల్లో ఉన్న వైసీపీ అభిమానులను,నాయకులను సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చిన వారందరినీ కలవడం జరిగిందనిత తెలిపారు.అందరూ సహకరించి 2024ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి,మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి,సీతారామపురం మండల కన్వీనర్ సుబ్బారెడ్డి,ఉదయగిరి జడ్పిటిసి మోడి రామాంజనేయులు,మాజీ వైస్ ఎంపీపీ బాలిబోయిన శ్రీనుయాదవ్,జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్,వెంకటేశ్వర్లు రెడ్డి,శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కప్ప గెలిచిన వెంగారెడ్డిపాళెం టీం ను అభినందించిన ఆనం ప్రసాద్‌రెడ్డి



**సంగం జనవరి 17 ప్రభాతవార్త** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామానికి చెందిన యువకులు సంక్రాంతి పర్వదినం సందర్భంగా జంగాలదొరువులో నిర్వహించిన టోర్నమెంట్‌లో జంగాలదొరువు టీంపై గెలవడం జరిగింది. ఫస్ట్‌ప్రైజ్ 10 వేల రూపాయాలు కప్పు గెలవడం జరిగింది.కప్పును వెంగారెడ్డిపాళెం గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా వెంగారెడ్డిపాళెం క్రికెట్ టీంకి ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆనం ప్రసాద్‌రెడ్డి విజేతలను అభినందించారు. కేకున్ కట్ చేసి ఆనం ప్రసాద్‌రెడ్డికి తినిపించారు. ఈకార్యక్రమంలో వెంగారెడ్డిపాళెం యువకులు పాల్గోన్నారు.

## అల్లూరు ఎంపిడివో కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం




**అల్లూరు, జనవరి 17 ప్రభాతవార్త** అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ గ్రామ్ స్వరాజ్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడివో జ్యోతి, ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్రబాబుల ఆధ్వర్యంలో డిజిటల్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, ప్రజాప్రతినిధులకు రెండు రోజులు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్రబాబు మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆన్‌లైన్ విధానం ద్వారా నమోదు చేసేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి లో మాజీ సర్పంచ్ గుంటుపల్లి అనురాధ చేరిక



**వరికుంటపాడు,జనవరి 17,ప్రభాతవార్త** : మండలంలోని కాంచెరువు గ్రామానికి మాజీ సర్పంచ్ గుంటుపల్లి అనురాధ,వెంగమనాయుడు లు బుధవారం స్థానిక మండలపార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ చంద్రా మదుసూధన్‌రావు పార్టీ కండువ కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ముందుగా స్థానిక వరికుంటపాడు లో మండల పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నూతన కార్యాలయాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు.అనంతరం కాంచెరువు మాజీ సర్పంచ్ గుంటుపల్లి అనురాధ తన అనుచరులతో పార్టీ చేరారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళి ఉదయగిరి లో బొల్లినేని వెంకటరామారావు ను భారీ మెజారిటితో గెలిపించాలనీ సూచించారు.రాష్ట్రంలో జగన్‌రెడ్డి చేస్తున్న అరాచక పాలన లో సామాన్యులు పడుతున్న కష్టాలను చూడలేక ఎంతో మంది వైకాపా వీడుతున్నారనీ అన్నారు.అలాగే తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైకాపా నేతలు చేవూరి రవితేజ,రసూల్ ను టిడిపి కండువ కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమములో మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్,తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మినారాయణ ,నేతలు చంద్రా వెంకయ్య,మహేష్,రాజా,మానం కొండలరావు,తాతపూడి లాభాన్,నందిపాటి ఆరోన్,గుర్రం గోపి,కామెపల్లి శ్రీనివాసులు,ఆరికొండ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.